## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు అడ్మిషన్ల కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేకల రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో వంద సీట్లు, అలాగే ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న విద్యార్థి, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, అలాగే ఓసీ విద్యార్థులకు రూ.200 ఫీజు ఉంటుందని తెలిపారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

టేకుమట్ల: మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు నేడు(సోమవారం) రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

### 'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

కాటారం: మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, మహిళా నాయకురాలు అయిత శకుంతల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు గీతాబాయి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని ఇసుక రవాణాను ప్రారంభించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. వారి హయాంలో ఇసుక లారీల కింద పడిపోయి అనేక మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజల ప్రాణాలు లెక్క చేయకుండా ఇసుక పేరిట కోట్లాది రూపాయలు దండుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదకం అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై అడ్డగోలు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### ఆర్థికసాయం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన శ్రీపతి చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, జంపాల చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, జయమ్మ, నాగమణి, అహల్య, అనిత, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

### పరామర్శ



గోవిందరావుపేట: మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన బిలావత్ భిక్షపతి మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ములుగు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు బొక్క సత్తిరెడ్డి ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్‌రావు, దేవేంద్రచారి, రవి బాబు, వెంకటేశ్వర్లు, మన్ సింగ్, రమేశ్, రాజు, శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రేగొండ: మండలంలోని భాగిర్తి పేట, భూపాలపల్లి మండలం శ్యామ్ నగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని, ఆచూకీ తెలిసిన వారు రేగొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై థామస్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 5.6 సెంటిమీటర్లు ఎత్తు, నలుపురంగు వెంట్రుకలు, గడ్డం, మొలతాడు ఆనవాళ్లతో మృతదేహం ఉందని ఎవరైనా గుర్తుపడితే సమాచారం అందించాలని తెలిపారు. 8712658144, 8712658123 నంబర్లను సంప్రదించాలన్నారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి



సునీత (ఫైల్)

రేగొండ: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన బొక్క సునీత (45) చాలా కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. శనివారం బాధను తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పంటల రక్షణకు రైతుల పాట్లు

**రోడ్డుపై దుమ్ముతో దెబ్బతింటున్న మిరప తోటలు**

- రోడ్లపై నీరు చల్లుతున్న రైతులు
- పంటల చుట్టూ గ్రీన్‌నెట్ ఏర్పాటు



దుమ్ము రాకుండా రోడ్డును తడుపుతున్న రైతులు



రోడ్డు పక్కన ఉన్న మిర్చితోటపై పడుతున్న దుమ్ము

వెంకటాపురం(కె): మండలంలోని ఆలుబాక నుంచి ఎదిర వరకు భారీ వాహనాలు, ఇసుక లారీలు అధికంగా వస్తుండటంతో రోడ్లపై దుమ్ము లేచి పంటలు దెబ్బతింటున్నాయి. ఇది ఇలా ఉండగా ఆర్ అండ్‌బీ రహదారి మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వదిలి పెట్టడంతో దుమ్ము విపరీతంగా లేస్తుంది. దుమ్ము మొత్తం లేచి రోడ్డు పక్కన ఉన్న మిర్చి, వరి పంటలపై పడుతోంది. పంటలను దుమ్ము నుంచి కాపాడుకునేందుకు రైతులు చీరలు, గ్రీన్ నెట్‌తో కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే మండల పరిధిలోని బోదాపురం గ్రామ సమీపం నుంచి సూరవీడు వరకు రైతులు మోటార్ల నుంచి పైప్‌లను ఏర్పాటు చేసుకొని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు రోడ్లను తడుపుతూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు రోడ్లకు మరమ్మతులు చేసి రోడ్లపై దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**తోటలు దెబ్బతింటున్నాయి..**



అధికారులు ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతుల పేరుతో తవ్వి వదిలేశారు. దీంతో రోడ్లపై భారీ వాహనాలు, ఇసుక లారీలు వస్తుండటంతో దుమ్ము లేచి మిర్చి తోటలు దెబ్బతింటున్నాయి. అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయించే విధంగా చర్యలు చేపట్టాలి.

– భూనేకరావు, రైతు, కొండాపురం

**రోడ్లు తడుపుతున్నాం..**



రోడ్లపై దుమ్ము లేచి తోటలపై పడి పూత పిందె దెబ్బతింటుంది. దీంతో రోడ్లుపై దుమ్ము లేవకుండా రోడ్లపైకి పైపులను ఏర్పాటు చేసుకొని నీటితో తడుపుతున్నాం. తోటలను కాపాడుకునేందుకు గ్రీన్‌మెట్‌తో కంచె ఏర్పాటు చేసుకున్నాం.

– సత్యనారాయణ, రైతు, బోదాపురం

## ఆరు గ్యారంటీలు అమలయ్యే వరకూ పోరాటం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కాలనీల్లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు, 420 హామీలను అమలు చేసే వరకూ ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీ నాయకులు నీడలా వెంబడిస్తూ పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో పర్యటించి 24వ వార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది పార్టీ మారారని, వారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారతారని అలాంటి వారిని ప్రజలు నమ్మరన్నారు. రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ కొంతమందికే అయిందన్నారు. రైతు భరోసాను ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7 వార్డు, 24వ వార్డుల్లో బీఆర్ఎస్ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సిగ్గం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల మౌనిక, మేకల రజిత, పార్టీ నాయకులు కొత్త హరిబాబు, కో–ఆప్షన్ సభ్యులు ఎండీ కరీం, బడితల సమ్మయ్య, ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, గండ్ర యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'అసత్యపు ప్రచారాలు చేస్తే సహించేది లేదు'

చిట్యాల: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అసత్యపు ప్రచారాలు చేస్తే సహించేది లేదని భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలును తుంగలో తొక్కడంతో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఒకేసారి రెండు లక్షలు రూపాయాల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులకు, రైతుకూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు అందించబోతున్న ఎకైక ప్రభుత్వం మనదే అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యామ్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఎమ్మెస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న మండల కేంద్రంలో మాదిగ కళాకారుల బస్సు యాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఫిబ్రవరి 7న హలో మాదిగ ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జల ప్రసాద్, వావిలాల స్వామి, సాంబశివరావు, వేల్పూల మల్లేశ్, మల్లికార్జున్, నరేష్, తిప్పనపల్లి రాంబాబు, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ఏఎస్సై దాట్ల కుమారస్వామి



ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారు. వాహనపత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. అలాగే వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి మద్యం తాగి వాహనాలను నడిపిన వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. వాహన పత్రాలు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ తుల రమేశ్, కానిస్టేబుల్ సుమన్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

## కార్మికుల వెంటే ఐఎన్‌టీయూసీ

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ కార్మికుల వెంట ఐఎన్‌టీయూసీ ఉంటున్నట్లు యూనియన్ కేంద్రం కమిటీ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి పసునూటి రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేల లాభాల బోనస్ ఇప్పించినట్లు తెలిపారు. సింగరేణికి కార్మికుల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించడానికి సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. సొంతింటి ఇళ్ల పథకం, 250 గజాల ఇంటి స్థలం, రూ.25లక్షల వడ్డీ లేని రుణాలు, పెర్క్స్‌పై ఆదాయ పన్ను రద్దు చేయడం, ఇతర సమస్యలపై యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగుల కోసం వయస్సు వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు తెలిపారు. రూ.కోటితో ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 2,364 మంది బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్‌లుగా ప్రమోషన్లు, యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏరియాలో స్థానికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం

ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండలంలోని కొండాయి గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి అందరూ కష్టపడి పని చేయాలన్నారు. అదేవిధంగా ప్రజలందరికీ నాయకులు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోయి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలన్నారు. రానున్న స్థానిక ఎలక్షన్‌లో వార్డునంబర్ల నుంచి సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల వరకు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, యూత్ జిల్లా కార్యదర్శి గౌస్, యూత్ బ్లాక్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్, జిల్లా ఎస్పీ సెల్ నాయకులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే



రుద్రారంలో సర్వే చేస్తున్న కార్యదర్శి

మల్హర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 8937 మంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 6579 దరఖాస్తులకు సర్వే నిర్వహించారు. క్షేత్రస్థాయి ఇబ్బందులు, దరఖాస్తులు సమర్పించిన కొందరు గ్రామాల్లో అందుబాటులో లేకపోవడం సర్వేను పూర్తి చేయడానికి కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని భావించిన క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా సర్వే ఇంకా కొనసాగతునే ఉంది. మిగిలిన సర్వేను పూర్తి చేయడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

## కమ్ముకున్న మంచు దుప్పటి




టేకుమట్ల మండలంలో ఆదివారం తెల్లవారు జామున తీవ్రమైన మంచుకురిసింది. ఉదయం 9గంటల వరకు మంచు కురవడంతో మండల ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. సెలవు రోజు కావడంతో పిల్లలు, వృద్ధులు ఉదయం చలి మంటలు కాగారు. – టేకుమట్ల

## వజ్రోత్సవాలకు సహకరించాలి

ఏటూరునాగారం: మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 60 ఏళ్లు పూర్వం నుంచి ఇప్పటి వరకు పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వజ్రోత్సవాలకు సహకరించాలని కార్యక్రమ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో నిర్వహించే వజ్రోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేసే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. పూర్వ విద్యార్థులు వారి విద్యా సంవత్సరంలోని స్నేహితుల వివరాలు తెలుసుకొని సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి పెద్ద ఎత్తున కార్యక్రమం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నూక ప్రభాకర్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, హబీబ్, అఫ్జల్, అలువాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఫత్తె మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంపీవీతో జాగ్రత్త

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



టేకుమట్ల: చైనాలో పుట్టి దేశంలో విలయ తాండవం సృష్టించి ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకున్న కరోనా వైరస్ పేరు మర్చిపోక ముందే చైనాలో మరొక హెచ్ఎంపీవీ( హ్యూమస్ మెటానిమో) వైరస్ ముంచుకొస్తుందనే ప్రచారంతో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు జాగ్రత్తలు జారీ చేస్తుంది. హెచ్ఎంపీవీతో రక్షణ పొందేందుకు గతంలో కరోనా వైరస్ మాదిరిగానే జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ వైరస్ లక్షణాలు దగ్గు, జలుబు ఉంటాయన్నారు. నిత్యం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుని తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సామాజిక దూరాన్ని పాటించాలని సూచిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలతో వైరస్‌ను తరిమికొట్టవచ్చని తెలుపుతున్నారు.

**జాగ్రత్తలు తప్పనిసరి**



హెచ్ఎంపీవీ సోకిన వారికి దగ్గు, జలుబుతో పాటు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. హెచ్ఎంపీవీ నుంచి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. కరోనా మాదిరిగానే ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని పాటిస్తూ, చేతులను సబ్బుతో నిత్యం శుభ్రం చేసుకోవాలి. పౌష్టికాహారాన్ని తీసుకుని, రోజులో ఎక్కువ నీటిని తీసుకోవాలి.

– డాక్టర్ ఆశాజ్యోతి
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెలిశాల

## 27వ రోజుకు చేరిన ఉద్యోగుల సమ్మె



సమ్మెలో కూర్చున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ములుగు: అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతో సమానంగా అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు జిల్లాకేంద్రంలో చేపడుతున్న సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. తాము చేస్తున్న పోరాటంలో అధికారులకు కానీ, ప్రజాప్రతినిధికి కానీ భయపడేదిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగు సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్‌పాడ్యా, ఉపాధ్యక్షుడు ఫిరోజ్, భూరెడ్డి విష్ణు, చిరంజీవి, స్వరూప, రాజేశ్వరి, రవి, దేవేందర్, లక్కి రవి, ప్రమీల, చందన, మమత, సుబ్బారెడ్డి, రమేష్, సంజీవ, స్వాతి, యశోద, రజిత, ఈశ్వరీ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ట్రస్మా క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ట్రస్మా నాయకులు

కాటారం: ట్రస్మా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న సబ్ డివిజన్ ప్రైవేటు పాఠశాలల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం పలు పాఠశాలలకు చెందిన జట్ల మధ్య కబడ్డీ, ఖోఖో సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఆయా పాఠశాలల జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఫైనల్‌కు చేరుకున్నాయి. నేడు ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ట్రస్మా ఏరియా కమిటీ అధ్యక్షుడు కొట్టె శ్రీశైలం తెలిపారు. గెలుపొందిన విజేతలకు మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా జనరల్ సెక్రటరీ సంపత్‌రావు, ఉపాధ్యక్షుడు జనగామ కార్తీక్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా కమిటీ కార్యదర్శి రాజబాబు, కోశాధికారి వెంకటేశ్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు మంజుల, శశి, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చైనా మాంజా అమ్మితే చర్యలు

- ఎస్సై శ్రావణ్‌కుమార్



చిట్యాల: చైనామాంజాను పరిశీలిస్తున్న సిబ్బంది

చిట్యాల: మండలంలోని కిరాణం, కంగన్‌హాల్, వివిధ షాపులలో చైనామాంజా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. కొన్ని షాపులలో దొరికినమంజాను సీజ్ చేసి ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా మంజా దారాలను విక్రయించినట్లయితే పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యాకయ్య, లాల్‌సింగ్, అస్లాం జానీ, లింగన్న, నవీన్, నాగరాజు, శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**చైనామాంజా విక్రయిస్తే చర్యలు**

ఏటూరునాగారం: ప్రమాదకరమైన చైనామాంజా దారాన్ని వ్యాపారస్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తాజొద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంజా దారం పతంగులకు కట్టి ఎగురవేయడం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. పతంగులకు కూడా మాంజా దారం ఉపయోగించకూడదని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో కోడి పందాలు, బెట్టింగ్‌లు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మాంజా దారం, పేకట, కోడి పందాలు, బెట్టింగ్ ఎవరు పాల్పడిన తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిట్యాల: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో 2010–11 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, మెటీరియల్స్‌ను అందించారు. అలాగే పాఠశాలకు ఐఐటి తరగతులను నిర్వహించడానికి డీజీ టీవీని బహూకరించారు. కరస్పాండెంట్ ఎండి.రాజీమహ్మద్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు బుర్ర పవన్‌కుమార్, ప్రశాంత్, తిరుపతి, కావ్య, మానస, దేవేందర్, ప్రవీణ్, సాయితేజ్, మానస ఉన్నారు.

ములుగు రూరల్: మండలపరిధిలోని మల్లంపల్లి జెడ్పీఎస్ఎస్‌కు చెందిన 2001–02 సంవత్సరంలో పదోవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.